విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 29 ఏప్రిల్ 2025 8 పేజీలు

సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1వ డివిజన్ 2వ మహాసభ అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన ఆండాళ్లమ్మ తోటలో సోమవారం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మితవాద విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సమావేశం ఏర్పాటు చేసి భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆనాటి నుండి దేశ స్వాతంత్ర్య పోరాటం కోసం విప్లవ మార్గంలో పయనిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేటట్లు చేసి బ్రిటిష్ వారిని మన దేశం నుంచి తరిమి కొట్టడానికి ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకులు ప్రాణాలను సైతం త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య అనంతరం రాజాభరణాల రద్దు, బ్యాంకులు జాతీయకరణ, దున్నే వాడికి భూమి కావాలంటూ లక్షలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు సీపీఐ పోరాటాల ద్వారా ఇచ్చిందని గుర్తు చేశారు. కార్మిక పండుగ 139 మేడేను ఏలూరు నగరంలోని వాడవాడలా జెండాలు ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో కొండ్రు సుబ్బారావు, అత్తులూరి సర్వేశ్వరరావు, వీరమాచనేని విమలా దేవి, పూడి అప్పలస్వామి, సంకు అప్పారావు వంటి నాయకులు నిస్వార్థంగా ప్రజలకు సొంత ఇంటిని అందించాలనే ఉద్దేశంతో అనేక కాలనీలు ఏర్పాటు ▶మిగతా 2లో..

అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన వినతులను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సకాలంలో పరిష్కరించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశిం చారు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహి స్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, జిల్లా పరిషత్ సీఈఓ వివి లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ▶మిగతా 2లో..

మేడే జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు

విశాలాంధ్ర -రాజమండ్రి : మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని, చికాగోలో జరిగిన కార్మిక లోకం రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారని, మేడేను కార్మిక లోకం అంత ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మెడికల్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తాటిపాక మధు మాట్లాడుతూ ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పని ముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడటం,చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం అన్నారు. ప్రపంచీకరణ వలన ▶మిగతా 2లో..

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - కాకినాడ : నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరిస్తూ, అందుకు సోమవారం వెలువడిన యావజ్జీవ ఖైదు విధిస్తూ ఇచ్చిన తీర్పే ఉదాహరణ అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే 2022 జూన్ 9వతేదీ తెల్లవారుజాము 3 గంటల సమయంలో కాకినాడ పట్టణం, మెయిన్ రోడ్డులో ఉన్న ఎస్ఆర్ గ్రాండ్ హెూటల్ రూమ్ నెంబర్ 306లో కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన పాలేపు కాసుబాబు (23)ను పల్లం గ్రామానికే చెందిన ముద్దాయి మల్లాడి రవికాసు (26) మద్యం గాజు సీసా పగులగొట్టి అనేక మార్లు క్రూరంగా పొడిచి హత్య చేశాడు. ఈ హత్య పై మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు పై కాకినాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసి, అప్పటి ఇన్స్పెక్టర్/ స్టేషన్ హౌస్ అధికారి పెదిరెడ్డి రామచంద్రరావు దర్యాప్తు చేసి, హంతకుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో అతని మీద ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. మొత్తం 24 మంది సాక్షులను విచారించారు. ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష, 10,000 రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తుది తీర్పు ఇచ్చారు. జిల్లా ఎస్పీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, దర్యాప్తు అధికారి (ప్రస్తుత మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్/ స్టేషన్ హౌస్ అధికారి) పెద్దిరెడ్డి రామచంద్రరావును ప్రత్యేకంగా అభినందిస్తూ, విచారణ విజయవంతంగా పూర్తి కావడానికి కృషి చేసిన కాకినాడ 2 టౌన్ సిఐ అప్పల నాయుడు, సిబ్బందిని అభినందించారు.

నిర్ణీత సమయంలోగా భూసేకరణ

- భూములు అందించిన వారికి వెంటనే పరిహారం అందించాలి
- భూములు స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో జాతీయ రహదారి భూసేకరణ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి, భూ యజమాను లకు వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో 365 బిజి (గ్రీన్ ఫీల్డ్ హైవే), 165 జాతీయ రహదారుల నిర్మాణ, భూసేకరణ అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జాతీయ రహదారులకు భూములు అందించిన వారికి వెంటనే పరిహారం అందించి, భూములు స్వాధీనం చేసుకుని రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఖమ్మం నుండి దేవరపల్లి 365 బిజి (గ్రీన్ ఫీల్డ్ హైవే) నకు సంబంధించి భూసేకరణ ద్వారా సేకరించిన భూములలో కొందరు రైతులకు చెల్లించవలసిన పరిహారాన్ని వెంటనే చెల్లించి భూములను స్వాధీనం చేసుకొని, రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. నిర్మాణంలో భాగంగా హెచ్ టి విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పామర్రు- ▶మిగతా 2లో..

ఆదాయం ఫుల్-చెక్‌పోస్టు నిల్

- పట్టించుకోని ప్రభుత్వం
- కనీస సౌకర్యాలు కరువు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలో ఉన్న పోలవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఆదాయం వస్తుంది. ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం పట్టణంలో జంగారెడ్డిగూడెం రోడ్డులో సుమారు 5 ఎకరాల విస్తీర్ణం కలిగిన మార్కెట్ యార్డులో గోదాములు రైతులు తాము పండించిన పంటను నిలువ చేసుకోవడానికి వస తులు ఉన్నాయి. 2014 నుండి 2019వ సంవత్సరం వరకు అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వంలో పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పారేపల్లి రామారావు మార్కెట్ యార్డులో సిసి రహదారులు నిర్మించి అభివృద్ధి చేశారు. పోలవరం మార్కెట్ కమిటీ ద్వారా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, మండలాల్లో జాతీయ రహదారిపై మార్కెట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేవారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు పోలవరం మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డును వేరుచేసి చింతల పూడి వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుండి పోలవరం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యకలాపాలు కొయ్యలగూడెం నుండే జరుగు తున్నాయి. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమ కూర్చే వ్యవసాయ మార్కెట్‌కు ప్రధాన రహదారి నాలుగు ▶మిగతా 2లో..

1.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- ఇంతవరకు రూ. 206.7 కోట్లు చెల్లింపు
- రబీ ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించిన జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర ఏలూరు: ఏలూరు జిల్లాలో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 12,380 మంది రైతుల నుంచి 1,55,529 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక గోదావరి సమావేశ మందిరంలో రబీధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. రైతుల నుంచి ఇంతవరకు రూ. 359.27 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ▶మిగతా 2లో..

ప్రభుత్వ పథకాలలో స్త్రీ మూర్తులకే పెద్దపీట

శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం ఉచిత కుట్టు శిక్షణ, టైలరింగ్ తరగతులను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు.

సోమవారం ఆయన తాడేపల్లిగూడెం 8వ వార్డు ప్రగతి జూనియర్ కళాశాల, 23వ వార్డు ప్రభుత్వ స్కూల్, పెంటపాడు మండల కార్యాలయంలో ఉచిత కుట్టుమిషన్ టైలరింగ్ శిక్షణను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర మహిళల అభ్యున్నతికై ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భారత్ ను అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని వారి కుటుంబాన్ని బలోపేతం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, కసిరెడ్డి మధులత, గుండుమోగుల విష్ణు ప్రియ,పెంటపాడు మండల తహసిల్దార్, సీతారత్నం, పాలూరు వెంకటేశ్వరరావు,మైలవరపు రాజేంద్రప్రసాద్, జిల్లా ఇన్చార్జి పి. శ్రావణి, డివిజినల్ ఇన్చార్జి జి.సత్య పరమేష్, తదితర అధికారులు నాయకులు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-లింగపాలెం: రాజకీయ నాయకుల ప్రలోభాలకు తలొగ్గి వెలుగు అధికారులు పనిచేస్తున్నారని రాష్ట్ర కార్మిక సంక్షేమ జిల్లా అధ్యక్షులు దేవులపల్లి రత్నబాబు, వివోఏ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాషిని విమర్శించారు.

లింగపాలెం మండలంలో వీవోఏలుగా పనిచేస్తున్న కొందరిని అన్యాయంగా విధుల నుంచి తొలగించడం పై న్యాయం చేయాలని కోరుతూ కొన్ని రోజులుగా లింగపాలెంలో నిరసన దీక్ష చేస్తున్నారు. వీరికి మద్దతుగా రాష్ట్ర సంఘ నాయకులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి వివోఏలను తొలగించారని వెలుగు ఏపిఎం, కార్యాలయపు సిబ్బంది రాజకీయ నాయకుల ఆదేశాలకు లోబడి పని చేస్తున్నారని వీరు పేర్కొన్నారు. విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లో చేర్చుకోవాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని అయినా ఈ ఆదేశాలను అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. అన్యాయాలకు పాల్పడుతున్న వెలుగు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వీరు డిమాండ్ చేశారు. తొలగించిన సింగగూడెం వివోఏ మానసిక వ్యాధితో మృతి చెందిందని దీనిపై దర్యాప్తు చేయాలని వీరు కోరారు. వీవోఏలకు న్యాయం చేయకపోతే రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరోజిని, మరియమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం (1వ పేజీ తరువాయి)

ఎన్వీవీ సత్యనారాయణ, కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ రామలక్ష్మి, సిపిఓ త్రినాద్ ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు అర్జీలు ఇవ్వడానికి ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావలసిన అవసరం లేదని, అర్జీదారులు వారి అర్జీలు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదార్లు వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశిం చారు. మొత్తం 439 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ (1వ పేజీ తరువాయి)

దిగమర్రు 165 జాతీయ రహదారి నిర్మాణంలో కైకలూరు మండలం గోనేపాడు, తదితర గ్రామాలలో భూసేకరణ పనులను సంబంధిత రైతులతో మాట్లాడి పూర్తి చేయాలన్నారు. జీలుగుమిల్లి- పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారికి సంబంధించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రహదారి భవనాల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, తహసీల్దార్లు చల్లన్న దొర, స్టీవ్ జోజి, కలెక్టరేట్ జాతీయ రహదారుల భూసేకరణ విభాగం అధికారి పోతురాజు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, రహదారులు, భవనాల శాఖ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

జయప్రదం (1వ పేజీ తరువాయి)

వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటిత మవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ఉత్సాహంతో పోరాడాలన్నారు. ఈ సమావేశంలో మోహన్ , కుమార్ నాగేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పోరాటం (1వ పేజీ తరువాయి)

చేశారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా ఆ కాలనీలలో అభివృద్ధి మాత్రం జరగడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూమి స్థానంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు వాగ్దానం చేసినట్లుగా పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు తక్షణ సహాయం చేయాలని తద్వారా పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిపే ప్రతి పోరాటంలోనూ ఒకటవ డివిజన్ నుంచి అధిక సంఖ్యలో హాజరై ఆ కార్యక్రమం జయప్రదం చేయాలని, రానున్న కాలంలో ఒకటో డివిజన్ సమస్యల పరిష్కారానికి పోరాడే పార్టీగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సహాయ

కార్యదర్శిగా వెదురుపర్తి శారదను మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొనుగోలు
(1వ పేజీ తరువాయి)

అందులో ఇంతవరకు రూ. 206.71 కోట్లను రైతుల ఆధార్ అనుసంధానిత ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. మిగిలిన రూ. 150.30 కోట్లను జమచేయు ప్రక్రియలో ఉందన్నారు.రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రారంభించిన 126 రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఏజెన్సీల ద్వారా ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం విక్రయించుకుని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. రైతుల శ్రేయస్సుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ఏజెన్సీల వద్ద గోనె సంచులు, టార్పాలిన్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా ఫిర్యాదులు చేసేందుకు జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08812-230448, 7702003584, 7569562076 నెంబర్లకు తెలియజేయవచ్చన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజరు పి.ఎస్.ఆర్. మూర్తి, డిఎస్ఓ ప్రతాప్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి తదితరులు పాల్గొన్నారు.

చెక్పోస్టు నిల్
(1వ పేజీ తరువాయి)

కూడలిలో ఎటువంటి చెక్ పోస్ట్ లేకపోవ డం గమనార్హం. కొయ్యలగూడెం పట్టణంలో పోలీస్ స్టేషన్ చుట్టూ చిరు వ్యాపారులతో పాటు మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ కూడా ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జాతీయ రహదారి నిర్మాణం విస్తరణ చేపట్టడం కోసం పోలీస్ అధికారులు, రహదారులు భవనాలు శాఖ వారు కలసి చిరు వ్యాపారుల దుకాణాలతో పాటు ఉన్న వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్టును కూడా తొలగించారు. అప్పటినుంచి ప్రభుత్వాలు మారుతున్నాయి కాని ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే మార్కెట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. నిలువచేవడానికి కూడా నిలువ నీడ లేక ఎండ,వాన,చలి, మూడు కాలాలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులను కొనసాగిస్తున్నారు.

పగటివేళల్లో గ్రామ శివారులో ఉన్న మార్కెట్ యార్డు వద్ద బడ్డీ ఏర్పాటు చేసి చెక్ పోస్ట్ సిబ్బంది విధులు కొనసాగించినప్పటికీ విధులు కొనసాగించే ప్రాంతంలో పాములు ఎక్కువగా సంచరించ డంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలలో రవాణా జరుగుతుందని, సెంటర్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, నిలువ నీడ కూడా లేకపోవడం విచిత్రం. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ ప్రధాన సెంటర్లో సంబంధిత శాఖ అధికారులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర-భీమడోలు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయం పరిధిలోని భీమడోలు నం. 1 పాఠశాలలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కరణం పెద్దిరాజు,మండల జనసేన అధ్యక్షుడు పత్తి మదన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు కోరారు. అనంతరం బాలిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, మానవతా మండల చైర్మన్ గుల్ల సూకరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు మద్దాల అప్పారావు,అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు పైడిమాల యుగంధర్, గ్రామ పెద్దలు తాటిమళ్ళ రామ్మూర్తి, ఈతకోట సత్యకృష్ణ రామకృష్ణ,ఆ జయ్,రమణ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనం పంపిణీ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో శారీరక విభిన్న ప్రతిభావంతులయిన జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు వీరవల్లి శంకర రావు కు రూ.65 వేలు విలువచేసే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని జిల్లా కలెక్టరు ఉచిత పంపిణీ చేశారు. మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయవలసినదిగా కోరుతూ పిజిఆర్ యస్ కార్యక్రమంలో గతంలో అర్జీ సమర్పించారు.

దీంతో జిల్లా కలెక్టరు స్పందించి మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేసి సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మూడు చక్రాల బ్యాటరీ వాహనం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని కుటుం బాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. మూడు చక్రాల బ్యాటరీ వాహనం ఉచితంగా అందజేసినందులకు వీరవల్లి శంకరరావు జిల్లా కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు,వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలే తొలి నేస్తం

విశాలాంధ్ర-ఏలూరు: పుస్తకాలే తొలి నేస్తం అని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ డి.ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిక్షణతరగతులు (సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమము) ప్రారంభమయ్యాయి. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న

ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలే మొదటినేస్తం అన్నారు. తరమ గ్రంథాలయానికి రావడం ఒక అలవాటు చేసుకోవాలన్నారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందన్నారు. కష్టంగా చదవద్దు- ఇష్టంగా చదవండి అంటూ సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.టి.సందీప్ కుమార్, డి.శ్రీవల్లి సీనియర్ రిసోర్స్పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ టీచర్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు.

ఈ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించు కోవాలని పలువురు వక్తలు కోరారు. తల్లిదండ్రులు సహకరించి వారి పిల్లలను ఈ శిబిరాలకు పంపాలని కోరారు. వేసవిశిక్షణ తరగతులలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జి,ఆంగ్లభాష, గణితం తదితర సబ్జెక్టులపై శిక్షణ ఇస్తామని గ్రంథాలయ అధికారి వెంకటరమణ తెలిపారు.ఈ కార్యక్రమంలో వక్తలు ప్రకాశరావు, నారాయణ,వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ యస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. భాస్కర్, దేవకిదేవి లతో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు నుండి వివిధ సమస్యలపై అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. నిర్ణీత గడువులోపుగా ఫిర్యాదులను పరిష్కరించని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో కొందరు అధికారులు వెనుకబడి ఉంటున్నారని వారందరూ అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాడాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన

విశాలాంధ్ర -భీమవరం: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం స్ఫూర్తితో అపరిష్కృత డిమాండ్ల సాధనకై మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. మేడే వేడుకల సన్నాహాల్లో భాగంగా ఎ.పి.మెడికల్ ఎంప్లాయిస్ ఔట్ సోర్సింగ్ యూనియన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ మేడేను పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఏఐటీయూసీ పోరాటాలను జ్ఞాపకం చేసుకోవాలన్నారు. ఔట్ సోర్సింగ్ మెడికల్ ఎంప్లాయీస్‌కు సమాన పనికి సమాన వేతనం అందడంలేదని, పిఎఫ్ లేదు, ఇఎస్ఐ లేదు, సెలవులేవు, అదనపు పని గంటల భారం వీటన్నింటిపై పోరాడాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని గళం విప్పాలన్నారు. ఏఐటీయూసీ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు ప్రమాదం ఏర్పడిందని వీటిని తిరిగి సంపాదించు కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సత్యవతి, నర్సమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయం అందించండి - సీపీఐ

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఇటీవల మద్దిగట్ల గ్రామంలో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ బృందం ఆ గ్రామానికి చేరుకుని నష్టపోయిన కంగాల సత్తిబాబు కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణం అడిగి తెలుసుకున్నారు. సుమారు 3 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందన్నారు. వారికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని, నష్టపోయిన ఆస్తి విలువ లెక్క కట్టి ప్రభుత్వం సహాయం అందించాలన్నారు. అనంతరం నిత్యవసర వస్తువులు బియ్యం దుప్పట్లు తదితర సామాగ్రి వారికి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, మండల కౌన్సిల్ సభ్యులు సోడే సత్తిబాబు,నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

భీమవరంలో తలసేమియా సెంటర్

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో త్వరలో తలసేమియా పిల్లలకు సెంటర్ ఏర్పాటు చేసి చికిత్సను ప్రారంభించనున్నట్లు కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షులు చదలవాడ నాగరాణి తెలిపారు.

సోమ వారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సేవలకు గోల్డ్ మెడల్‌ను సాధించడం అభినందనీయ మని, దీనికి కృషి చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది అభినందనీయు లన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మే 8న రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయ వాడ రాజ్ భవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును అందుకోనున్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ ఎం ఎస్ వి ఎస్ బద్రి రాజు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారా యణ రెడ్డి, జిల్లా జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

వైసీపీకి మనుగడ లేదు

విశాలాంధ్ర - పాలకొల్లు: రాష్ట్రంలో వైసీపీకి భవిష్యత్తులో మనుగడ ఉండదని, ఓట్లు అడిగే అర్హత కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పాలకొల్లు మండలం లంకల కోడేరు, వెంకటాపురం గ్రామాల్లో రూ.86 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి ఆయన శంకుస్థాపన చేశారు. లంకల కోడేరు గ్రామంలో రూ.20 లక్షలతో కోడేరు నెంబర్ వన్ బ్రాంచి ఛానల్ పై,గ్రావెల్ రహదారి నిర్మాణ పనులు, ఇదే కాలువపై మరో రూ.9.99 లక్షలతో త్రవ్వకం పనులను మంత్రి రామా నాయుడు ప్రారంభించారు. వెంకటా పురంలో రాపాక ఛానల్ పై రూ. 41.50 లక్షలతో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులను,ఇదే కాలువపై రూ.9.95 లక్షలతో త్రవ్వకం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అంగర చిన్న, సర్పంచ్ చొప్పల రజిని, సర్పంచ్ పెనుమత్స వివేక్ వర్మ,కోడి విజయభాస్కర్, నెక్కంటి అదినారాయణ, పెనుమత్స సత్యనారాయణ రాజు,ఆదూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వికాస కార్మికుల ఇబ్బందులను తొలగించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెంరూరల్: పని ప్రదేశాలలో పనిచేస్తున్న గ్రామీణ వికాస కార్మికులు పనిప్రదేశాల్లో కాకుండా 500 మీటర్లు దూరంలో ఫోటోలు తీయడం కార్మికులకు ఇబ్బందిగా ఉంటుందని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం గ్రామీణ ప్రాంతం వెంకటరామన్న గూడెం, జగ్గన్నపేట, రామన్నగూడెం,పెద్ద తాడేపల్లి గ్రామాలలో పని ప్రదేశాలలో వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గ్రామీణ వికాస శ్రామికులు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వాలు పరిష్కరించాలని అన్నారు. ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ వికాస కార్మికులు పనిచేసే ప్రాంతం నుండి గ్రామానికి 5 కిలోమీటర్లు పైబడి మహిళలు, వృద్ధులు కాలినడకన వెళ్లి పని చేస్తున్నారని తెలిపారు. చేసే పని ప్రదేశంలో కాకుండా వేరే ప్రాంతంలో దూరంగా ఫోటోలు తీస్తున్నారని దానివలన ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాలవలు, పంట బోదులు, చెరువులు, పనిచేస్తున్న వారు కొలతలతో నిమిత్తం లేకుండా రోజువారి కూలీ నిర్దేశించిన విధంగా రూ.307 ఇవ్వాలని, నిత్యవసర వస్తువులు విపరీతంగా పెరగడం వలన కూలి రేటు కనీసం రూ.700 కు పెంచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ నాయకులు దిద్దే నాగేశ్వరరావు, గ్రామీణ వికాస శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రామిక వర్గాలకు మేడే ప్రాముఖ్యత వివరించాలి

విశాలాంధ్ర -భీమవరం: మేడే సందర్భంగా మే ఒకటవ తేదీన ఎర్రజెండాలను ఎగరేసి శ్రామిక వర్గ ప్రజలకు మేడే ప్రాముఖ్యతను చాటి చెప్పాలని సీపీఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతా రామ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో ఎర్ర జెండాలతో అలంకరించి గ్రామీణ పల్లె ప్రజలకు, వృత్తికారులకు, బడుగు, బలహీన వర్గాల వారికి మేడే ప్రాముఖ్యతను చాటి చెప్పాలని అన్నారు. నాటి రష్యాలో శ్రామికుల పోరాటాలను జనాల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస రావు, తిరుమాని కామేశ్వరరావు, ప్రజా నాట్యమండలి కళాకారుడు చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై వర్క్‌షాపు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వచ్చే నెల 12 నుంచి 16 వరకు ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వ హించ నున్నామని కార్యక్రమ కో ఆర్డినేటర్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ తెలిపారు.త్రీడీ మోడలింగ్ డిజైన్, ప్రింటింగ్, స్కానింగ్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులు తెలుసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను తీసుకుంటామని, ఆసక్తి గల విద్యార్థులు మే 5వ తేదీలోపు తమ పేర్లను నమోదు నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టర్ లోని క్యూ ఆర్ కోడ్ ను విద్యార్థులు స్కాన్ చేసి గూగుల్ ఫార్మ్ నింపాలని, ఇతర వివరాలకు 99854 57227, 90101 01065 నెంబర్లను సంప్రదించాలని వివరించారు.

వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను సద్విని యోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్. కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి పద్యాలు బోధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసు కోవాలని, మేధాశక్తిని పెంపొం దించుకు నేందుకు, ప్రాపంచిక విషయాలు తెలుసు కునేందుకు పుస్తక పఠనం చేయాలని తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని, మానసిక వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. డాన్స్ మాస్టర్ శ్యామ్ విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంధి కుమారవెంకటేశ్వర వరప్రసాద్, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ జి.ఎం. వడ్డి వెంకటేశ్వరరావు, చాన్‌బాషా గ్రంథాలయ సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

- వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ హాల్‌లో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డి ఎం హెచ్ ఓ ఆర్.మాలిని, డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్ కుమార్ లతో కలెక్టర్ సమీక్షించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోజూ తగినన్ని నీళ్లు తాగడం,నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు.ముఖ్యమైన పనుల మినహా మధ్యాహ్నం గం.12నుండి సాయంత్రం గం.4వరకు బయటకు వెళ్లకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అవసరమైన పనులను నిర్వహించకూడదని సూచిం చారు. పిల్లలు,గర్భిణీలు,వృద్ధులు ఎండాకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో తల కప్పుకునే విధంగా టోపీలు,గుడ్డ మఫ్లర్లు వాడాలని సూచించారు. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలన్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకోవ డం మానుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా, పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవా లన్నారు. వడదెబ్బతగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని,వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు.చెమట పట్టక పోవడం,వణుకు పుట్టడం మగత నిద్ర లేదా కలవ రింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం,ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో, గ్రామాల్లో ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉన్నందున, అవసరమైన వారు దీన్ని ఉపయో గించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర- ఉంగుటూరు : మే 2వ తేదీన భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి సభకు ఉంగుటూరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఉంగు టూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమ వారం ఉంగు టూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉంగుటూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిలుగా ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, పర్యటనకు సంబంధించి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన అనకా పల్లి టీడీపీ అధ్యక్షులు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా అమరావతిలో మోదీ పర్యటనను విజయవంతం చేయటంలో భాగంగా నియోజకవర్గం తరుపున చేయవలసిన ఏర్పాట్లు గురించి చర్చించారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర- ఉండి : వేసవి విజ్ఞాన తరగతులు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడతాయని రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్యామల రావు అన్నారు. ఉండి శాఖ గ్రంథాల యంలో వేసవి విజ్ఞాన తరగతులను ఈనెల 28 నుండి జూన్ ఆరో తేదీ వరకు నిర్వహిస్తారని గ్రంథాలయ అధి కారి జె.వి. కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ ఆటపాటలు కథలు కబుర్లు పంచుకోవడానికి వ్రాయటం గీయటం చెప్పటం వంటి వాటికి విజ్ఞాన తరగతులు వేదిక అవుతుందన్నారు. ఈ విజ్ఞాన తరగతులలో పిల్లలు ఓ కమ్మని కథ వ్రాయవచ్చు ఓ కమ్మని కథ చెప్పవచ్చు అంతేకాకుండా చక్కని బొమ్మను గీయవచ్చు అన్నారు. విజ్ఞాన తరగతులలో పిల్లల ఉత్సాహంగా ఉల్లాసంగా గడపవచ్చు అన్నారు. సైన్స్ ప్రాక్టికల్ స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు అన్నారు. ఈ తరగతులను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని శ్యామల రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో పిల్లలతో పాటు శాఖ గ్రంథాలయ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం పట్టణంలో వనిత క్లబ్ గోల్డ్ , కంచర్ల కాశి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలను ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యుడు బొమ్మిడి నాయకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చరవాణికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్, కథలు చెప్పడంతోపాటు వివిధ రకాలైన ఆటలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథులుగా రామకృష్ణ, జడ్పీహెచ్ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగించుకుని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కలిదిండి పబ్లిక్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సన్నీ బాబు, గ్రంథాలయ శాఖ అధికారి జె. రమేష్ బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు తక్షణ వైద్య సదుపాయం కల్పించాలి

జడ్జి రత్న ప్రసాద్ ఆదేశం

విశాలాంధ్ర-ఏలూరు : ఖైదీలకు ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా తక్షణం వైద్య సదుపాయం కల్పించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ జైలర్‌ను ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం కె.రత్న ప్రసాద్ ఏలూరు నగరంలోని కోటదిబ్బ ప్రాంతంలో గల జిల్లా కారాగారాన్ని సందర్శించి అక్కడున్న వంటకాలను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే ఆహారం, మంచినీరు విషయంలో రాజీ పడవద్దని జైలు అధికారులకు సూచిం చారు. ఖైదీలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా తక్షణం వైద్య సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఇటువంటి విషయాల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించవద్దని చెప్పారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ ఖైదీలతో మాట్లాడుతూ కారాగారంలో ఎటువంటి అసౌకర్యానికి గురైన తక్షణం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని లేదా పారా లీగల్

వాలంటీరు, ప్యానల్ లాయర్లకు తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని ఖైదీలకు భరోసా ఇచ్చారు. ఖైదీల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు పొందటంలో న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని తక్ష ణం సంబంధిత అధికారుల ద్వారా సంక్షేమ పథకాల అందేడట్లు కృషి చేస్తామని సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఎట్టకేలకు ఉంగుటూరు మండలంలో కాలవ గట్టు ఆక్రమణలను సోమవారం తొలగించారు. అన్ని శాఖల అధికారులు దగ్గరుండి కాలవ గట్టుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను జెసిబి తో తొలగించి నేలమట్టం చేశారు. మొదటగా ఉంగుటూరు గ్రామం, నారాయణపురం, చేబ్రోలు గ్రామంలోని కాలవ గట్టుకు ఇరువైపులా ఉన్న ఇల్లు, షాపులను తొలగించారు. రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖ, పంచా యతీరాజ్, మండల పరిషత్ చెందిన అధికారులు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగింపులు సమన్వయంతో తొలగించారు. ఉంగుటూరు టోల్గేట్ వారు కాలవ గట్టు ఆక్రమించుకొని ఉన్నారని వారిని ఎందుకు తొలగించ

రని మండల టిడిపి అధ్యక్షులు పాతూరి విజయకుమార్, సీనియర్ టిడిపి నాయకుడు కడియాల రవిశంకర్ ప్రశ్నించారు. ఇళ్లు తొలగించి పేదలకు అన్యాయం చేయడం సబబు కాదు అన్నారు.

ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్‌కండిషనర్ కోర్సులో యువతకు శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి. యల్.టి. సి సహాయ సంచాలకులు ఎస్. ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన క్రింద "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మే,10వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డి.యల్.టి.సి. కార్యాలయానికి పంపాలని, వివరాలకు:9493482414 నెంబర్లను సంప్రదించగలరని ఉగాది రవి తెలియజేసారు.

10వ తరగతి ఫలితాలలో సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర- ఏలూరు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక విద్యానగర్లోని శ్రీ చైతన్య ఐపీఎల్ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు అందరూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావడంతో పాటు 595 మార్కులు సాధించి పాఠశాల పేరును నలు దిశలా చాటారు. 10వ తరగతి విద్యార్థులు 600/595, 594, 593, 592, 591 మార్కులతో

ఇద్దరు ఉత్తీర్ణత సాధించగా 590 మార్కులతో 11 మందికి ఉత్తీర్ణత సాధించారన్నారు. 580 మార్కులతో 24 మంది, 570 మార్కు లతో 37 మంది, 560 మార్కులతో 46 మంది, 550 మార్కులతో 51 మంది, 500 మార్కులతో 74 మందికి పైగా ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ వి.దుర్గారావు విద్యార్థులను అభినందిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యధిక మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛాలు అందించి అభినందించారు. పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా విద్యను పిసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని చైతన్య విద్యార్థులు నిరూపించారని చెప్పారు. ఒత్తిడి లేని విద్యను అందిస్తున్న చైతన్య యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం సుంకర పార్థసారథి, రీజినల్ ఇన్‌చార్జి సిహెచ్.ఉదయ భాస్కర్, అకడమిక్ కో - ఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు, డీన్ కెవి.లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - కాకినాడ : సోమవారం కదలి ఈశ్వరి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ ముస్లిం సోదర, సోదరీమణులు కలిసి కాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన కుటుంబాలకు నివాళు లర్పిస్తూ భానుగుడి జంక్షన్ వద్ద నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడు పూడి సత్తిబాబు, చొల్లంగి వీరబాబు, లుటుకుర్తి మోహన్, చొల్లంగి వేణుగోపాల్, మాకినేడి భాస్కర్, వెంకటలక్ష్మి, మిరియాల హైమవతి, తుట్ట లీలావతి, సుజాత, అనుసూరి చిన్నబాబు, వాసంశెట్టి బీమరాజు, అనుసూరి త్రినాథ్, అనుసూరి విజయకుమార్ తదితర సోదరులు పాల్గొన్నారు.

సాహితీ రెడ్డిని ఎమ్మెల్యే సత్కారం

విశాలాంధ్ర - అనపర్తి : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఆర్ఎస్ పేటకు చెందిన కర్రి అభిజ్ఞా సాహితీ రెడ్డి 590/600 మార్కులు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సత్కరించి, అభినందించారు. సోమవారం రామవరంలో అభిజ్ఞ సాహితీ రెడ్డిని, అత్యున్నత మైన మార్కులు సాధించిన కుతుకులూరు జడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి, కర్రి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఆంధ్రదేశపు కీర్తి పతాకను ఇంగ్లాండు వరకు వ్యాపింప చేసి మాతృ ప్రేమను అతిథులకు పంచి జీవితాన్ని చరితార్థం చేసుకున్న అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దానాలలో అన్నదానం గొప్పదని ఆకలికి కుల, మత బేధాలు, పేద, ధనిక అనే తారతమ్యాలు లేవని అన్నారు. అటువంటి అన్నదానం చేసి విశ్వమానతకు అద్దం పట్టిన మహిళా మణి డొక్కా సీతమ్మ అని అన్నారు. లంక గన్నవరంలో ఎవరు ఏ వేళలో వచ్చి భోజనం అడిగినా లేదు లేదా తర్వాతరా అనే పదం లేకుండా అన్నం పెట్టిన మహా ఇల్లాలు డొక్కా సీతమ్మ అని అన్నారు. అన్నదానమే కాదు ఎన్నో పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు విరాళాలు ఇచ్చిన దాత డొక్కా సీతమ్మ అని అన్నారు. ఆమె చరిత్రను పాఠశాల స్థాయిలో తెలుగు పాఠ్యాంశంగా ప్రచురణ అవుతుందని అన్నారు. అడబాల రత్న ప్రసాద్ సౌజన్యంతో వృద్ధులకు భోజన వితరణ జరిగింది. చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - పి గన్నవరం : మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. కె నుగుపల్లిలో సోమవారం మత్స్యకారుల ఆధ్వర్యంలో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. మత్స్యకార భరోసా ప్రారంభంతో ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేట నిషేధం సమయంలో ఆర్థిక సహాయాన్ని రూ.10వేలు నుంచి 20 వేలుకు పెంచి మత్స్యకారులకు ఆర్థిక చేయూత నందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నామన రాంబాబు, దాసరి వీర వెంకట

సత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొంతు పెదబాబు, చిట్టూరి శ్రీనివాస్, వి కుమార్, ఎస్ పెద్దిరాజు, ఆదిమూలం సురయ్య కాపు, నియోజవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర - కడియం : కడియం మండల పరిధిలో అన్ని పంచాయతీలలోనూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కె. రమేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామపంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి కుళాయి పైప్ లైన్లు మరమత్తులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. చేతి పైపులు సక్రమంగా నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక గ్రామాల్లో ముఖ్య కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ తాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు సకాలంలో అందించాలని ఎంపీడీవో సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు జమ కాబడుతున్నందున పంచాయతీ తీర్మానాల ఆమోదం

మేరకు ఆయా పనులను పూర్తి చేయడానికి గ్రామ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు రూప్ చంద్,శ్రీనివాస్ రెడ్డి, ఎ. శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి, ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుభవం జోడించి మూల్యాంకనం చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మీ అనుభవం జోడించి తగిన విధంగా మూల్యాంకనం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న బీఈడీ మూల్యాంకన కేంద్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ సోమవారం పరిశీలించారు. సీనియర్ అధ్యాపకులకు తగు సలహాలు సూచనలు అందించారు. సుమారు10,600 మూల్యాంకపత్రాలుకి సంబంధించి 72 మంది అధ్యాపకులతో

మూల్యాంకనం జరుగుతుందని బివోఎస్ చైర్మన్ డాక్టర్ కె. సుబ్బారావు వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీకి తెలిపారు. ఈ కార్యక్రమం లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, బీఈడీ విద్య కళాశాల సహాయ ఆచార్యులు వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

విశాలాంధ్ర - రాజోలు : విద్యార్థి దశ ప్రతీ వ్యక్తి జీవితంలోనూ అత్యంత కీలకమైన దశ అనీ, ఆ దశలో బాధ్యతాయుతంగా ప్రవర్తించేవారు మాత్రమే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మలికిపురం ఎస్ఐ సురేష్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు పోలిశెట్టి గణేష్ అధ్యక్షతన రాజోలు నియోజకవర్గం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను మలికిపురం దీప్తి కళాశాల ఆవరణలో ఘన సన్మానించారు.

ఈ సమావేశంలో వక్తలందరూ ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రంలో విద్యాశాఖాధికారులు కిషోర్, మద్దాలి వెంకటేశ్వర్ రావు, రాజోలు విద్యాశాఖాధికారి నల్లి మనోహర్, ప్రధానోపా ధ్యాయులు మెహర్, దీప్తి కళాశాల ప్రిన్సిపాల్ సుధ, మలికిపురం డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు నక్కా రమేష్ బాబు, పీ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆర్టీసీ ఉద్యోగుల సమస్య తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు డిఎంఆర్ రాజు అన్నారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు సోమవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కొవ్వూరు సభ్యులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. జోనల్ అధ్యక్షులు డి ఎమ్ ఆర్ రాజు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. రీజనల్ కార్యదర్శి ముఖర్జీ , రీజనల్ అధ్యక్షులు సి హెచ్ ఎస్ రాజు,డిపో సెక్రెటరీ వీ.శివకుమార్,సిసిఎస్ డెలిగేట్ వీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఆపదలో ఉన్న కుటుంబాలను ఎంఎంఆర్ ట్రస్ట్ పేరు మీద ఆదుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని చైర్మన్, వైసీపీ నేత ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో బలిజి వీర్రాజు భార్య ఐటీవల కాలంలో గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారని తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని చెప్పి మెరుగైన వైద్యం గురించికి డాక్టర్లను సంప్రదిస్తానని మురళి రాజు భరోసా కల్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, కోన బాబ్జి, గుమ్మిడి రామకృష్ణ, నల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

పదకొండు వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - సీతానగరం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో దాళ్వా సీజన్‌లో మంగళవారం నాటికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మంగళవారం నాటికి 11007.36 మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగిందని మండల వ్యవసాయ అధికారి సూర్య రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతులు వద్ద దాళ్వా సీజన్‌లో వరి పంట త్వరితగతిన కొనుగోలు జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా అత్యధికంగా చినకొండేపూడి రైతు సేవా కేంద్రం ద్వారా అత్యధికంగా 2551, పురుషోత్తపట్నం 1751 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల వద్ద సుమారు 95 శాతం వరి పంట కొనుగోలు పూర్తి అయ్యిందన్నారు. రైతులు వద్ద మిగిలి ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

విజ్ఞాన సంపదకు గ్రంథాలయాలు నిలయం

విశాలాంధ్ర - గోపాలపురం : విజ్ఞాన సంపదకు నిలయాలైన గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జి శ్రీనివాసరావు ఆకుల ఉమామహేశ్వరరావు కోరారు. గోపాలపురం శాఖ గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం ఎంఈఓ జి. శ్రీనివాసరావు. మాట్లాడుతూ ఈ 40 రోజులు స్టూడెంట్స్ తమ విలువైన సమయాన్ని టీవీలు వద్ద, సెల్ఫోన్లతో కాలం వృధా చేయకుండా గ్రంథాలయమున విచ్చేసి తమ మేధస్సును పెంచుకోవాల్సిందిగా విద్యార్థులకు తెలియ జేసినారు. ఈ తరగతులలో విద్యార్థులు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు వెజ్జు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సప్ప సత్యనారాయణ, తప్పెట్ల సరిత, సిఆర్పి నాగరాజు తదితర ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : వేసవికాలంలో చిన్నారులు నీడ పట్టునే ఉంటూ విజ్ఞానాన్ని అలవర్చుకునే విధంగా ఆటపాటలతో నీతి కథలు అలవరుస్తూ, వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టీ నాగేంద్ర కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు సోమవారం కొవ్వూరు గ్రంథాలయ శాఖ కార్యాలయం నందు వేసవిజ్ఞాన సదస్సులను మున్సిపల్ నాగేంద్ర కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో చిన్నారులు మేడపట్టునే ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చక్కటి విజ్ఞానాన్ని మెరుగు పరుచుకునేందుకు వేసవి విజ్ఞాన సదస్సు దోహద పడతాయన్నారు. ఎంఈఓ రామకిషోర్, సంస్కృత పాఠశాల విశ్రాంతపు ప్రధానోపాధ్యాయులు గోవర్ధనపు శ్రీనివాస్ మూర్తి, దగ్గర ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే కూటమి లక్ష్యం

విశాలాంధ్ర - పి గన్నవరం : మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. కేనుగుపల్లిలో సోమవారం మత్స్యకారుల ఆధ్వర్యంలో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మత్స్యకార భరోసా నారమంతు ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేట నిషేధం సమయంలో హార్దిక సాయం రూ.10000 నుంచి 20 వేలకు పెంచి మత్స్యకారులకు హార్దిక చేయూత నందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నామన రాంబాబు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావు, బొంతు పెదబాబు, సిట్టూరి శ్రీనివాస్, వి కుమార్, ఎస్ పెద్దిరాజు, ఆదిమూలం సురయ్య కాపు, నియోజవర్గ కోటవి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ మెగా మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర - అమలాపురం : వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి215ఎ ఆధ్వర్యంలో సోమవారం మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ క్యాంపును డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రవాణ శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. కంటి పరీక్షల విభాగాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ప్రారంభించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ మరియు రాజమండ్రి మ్యాక్స్ విజన్ హాస్పిటల్ సహకారంతో అమలాపురం వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్దనరావు కళ్యాణ మండపంలో సుమారు 250 మంది స్త్రీ, పురుషులకు ఉచితంగా క్యాన్సర్, గ్యాస్ట్రో, కంటి పరీక్షలు చేయడం జరిగినది. డాక్టర్ ఎన్ సుధీర్ (మీా జనరల్ సర్జన్, సిహెచ్‌జిఐ సర్జరీ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎయిమ్స్ న్యూ ఢిల్లీ), డాక్టర్ బి ఉదయ్ కుమార్ జనరల్ మెడిసిన్‌చే ఉచిత క్యాన్సర్ టెస్టులు, గ్యాస్ట్రో టెస్టులు చేసినారు. రాజమండ్రి మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ డాక్టర్ అరుణ ఉచిత కంటి పరీక్షలు చేశారు. వాసవి క్లబ్ గవర్నర్ యెండూరి రాఘవ కుమారి, యెండూరి నాగేశ్వరరావు, బచ్చు పార్వతీ దేవి, చుండూరు సుధీర్, తటవర్తి బంగారం, బోడ వీర్రాజు, ఆర్‌సి పచ్చిగోళ్ళ సుధ, ఆర్‌సీబికే ఎవిఎస్ గుప్త (కోటయ్య), జెడ్‌సి సుభాషిని, గోల్డెన్ వనిత ప్రెసిడెంట్ శ్రీనివాస కుమారి, అమలాపురం క్లబ్ ప్రెసిడెంట్ తట్టపర్తి ప్రసాదు, కోనసీమ ప్రెసిడెంట్ వేమన నరసింహమూర్తి, అమలాపురం వైశ్య సంఘ కార్యవర్గ సభ్యులు వరదా సూరిబాబు, తదితరులు ఈ మెడికల్ క్యాంపులో పాల్గొని వారి వారి సేవలను అందించారు.

బాలికల వివాహాలను ఆపాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : గ్రామాల్లోని పెద్దలు 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేస్తుంటే అటువంటి వాటిని ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కిశోర్ వికాసం కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి శివ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు వయస్సు గల బాలికలకు కిషోర్ వికాసం పై అవగాహన కల్పించాలన్నారు. దీనికి గ్రామస్థాయిలో కమిటీ ఉంటుందన్నారు. ఈ కమిటీలో మహిళా పోలీసు కన్వీనర్‌గా, అంగన్వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ సభ్యులుగా ఉంటారన్నారు. వారు గ్రామాలలో మే రెండవ తేదీ నాటికి సెలవుల్లో ఉన్న బాలికలను, బడి బయట ఉన్న బాలికలను జతపరిచి గ్రూపు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పలువురుకి గాయాలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు మండలం కోరంగి వద్ద 216 జాతీయ రహదారిపై అదే సమీపంలో గల నెక్కంటి రొయ్యల కంపెనీలో పనులు ముగించుకుని కాకినాడ వైపు వెళుతున్న ఆటోకు కుక్క అడ్డు రావడంతో ఆటో తిరగబడి ఆటోలో ఉన్నటువంటి ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరితోపాటు ఆటో డ్రైవర్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో వీరందరినీ హుటాహుటిన తాళ్లరేవు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి బాగానే ఉందని కోరంగి పోలీసులు తెలియజేశారు.

సాంఘిక బహిష్కరణపై కేసు నమోదు చేయాలని వినతి

విశాలాంధ్ర - కాకినాడ : మల్లం ఘటన పై అట్రాసిటీ కేసు నమోదు చేస్తేనే సాంఘిక బహిష్కరణ వంటి సామాజిక రుగ్మతకు సమాధి అని తక్షణమే కేసు నమోదు చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండు చేసారు. పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు దళితులను వెలి చేసిన ఘటన పై జిల్లా అధికారుల తీరును నిరసిస్తూ విదసం పిజిఆర్ఎస్‌లో కలెక్టరుకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో వెంకట రావు మాట్లాడుతూ మల్లం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ పై కేసు నమోదు చేయాలని, విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, మృతుడు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, సామాజిక వెలిపై కేసులు కట్టాలని, వెలికి కారకులైన దోషులను కాపాడుతున్న అధికారులపై కూడా ఎస్సీ, ఎస్టీ పిఓ యాక్ట్ సెక్షన్ 4 ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. విదసం సహాయ కన్వీనర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి రేవు తిరుపతి రావు, రాష్ట్ర నాయకులు జాజి ఓంకార్, బూల భాస్కర రావు, మూర మహేశ్, గుబ్బల శ్రీనివాస్, రామకృష్ణ, అమల దాసు రాంబాబు, ఎస్ నూక రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్నగూడెం గ్రంథాలయ అధికారిని అనిత కోరారు యర్నగూడెం శాఖా గ్రంథాలయం నందు సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులకు ఉదయం 8గంటలనుండి మధ్యాహ్నం12 గంటలవరకూ వ్రాయడం చదవడం మాట్లాడడం డ్రాయింగ్ చెస్ వ్యక్తిత్వ వికాసం వంటి పలు నైపుణ్య శిక్షణలను నిపుణులైన బోధకులచే 40రోజులపాటు అందిస్తామని గ్రంథాలయ అధికారి అనిత తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ నాయకులు బొల్లిన విజయభాస్కర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించడం విద్యార్థులకు మంచి సదవకాశమని విద్యార్థుల తల్లితండ్రులు గమనించి తమ పిల్లలను ప్రోత్సహించి గ్రంథాలయానికి పంపించాలన్నారు. పారిశ్రామికవేత్త టీడీపీ నాయకులు పెన్మెత్స సుబ్బరాజు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారని భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యాదాల కిషోర్ పాలూరి వెంకట చరిత బాలాజీ డి రవీంద్ర రీడర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షితకు కాంస్య పతకం

విశాలాంధ్ర - అనపర్తి : భోపాల్ పట్టణంలోని లోయర్ లేక్ వేదికగా ఏప్రిల్ 24 నుంచి 28 వరకు నిర్వహించిన 35వ నేషనల్ కెనోయ్ స్ప్రింట్ ఛాంపియన్షిప్‌లో అనపర్తికి చెందిన చిన్నారి అథ్లెట్ గొలుగూరి వర్షిత తన ప్రతిభను చాటింది. సబ్ జూనియర్స్ కే4 - 500 మీటర్స్ విభాగంలో కాంస్యం పతకాన్ని గెలుచుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో కేరళలో నిర్వహించిన ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఇంటర్ స్థాయి) మీట్‌లో వర్షిత తన ప్రతిభతో నాలుగు పతకాలు (మెడల్స్) గెలుచుకుంది. గత నెల భువనేశ్వర్‌లో నిర్వహించిన ఒడిశా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వర్షిత వివిధ విభాగాల పోటీల్లో పాల్గొని తన ప్రతిభను మరింతగా మెరిపించి ఏకంగా ఏడు పతకాలు సాధించడం జరిగింది. వర్షిత విజయవాడలోని ఎన్ఎస్ఎం పాఠశాలలో 8వ తరగతిలో చదువుతోంది. ఒడిశా రాష్ట్రం జగత్పూర్‌లో గల కేంద్ర ప్రభుత్వ సంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణ కేంద్రంలో జాన్సన్, దిలీప్, రాజ్ కుమార్, న్యూట్రల్ మరియు నజీష్ వంటి అనుభవజ్ఞులైన కోచ్‌ల నేతృత్వంలో శిక్షణ తీసుకుంటోంది. కాంస్య పతకం సాధించిన వర్షితను పలువురు అభినందించారు.

క్రీడా పరికరాలకు వినతి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : బోట్ క్లబ్ ఉద్యానవనంలో బాల బాలికలకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నందున పిల్లల ఆహ్లాదం కోసం క్రీడా పరికరాలను సమకూర్చాలని కోరుతూ సానా సతీష్ ఫౌండేషన్ నిర్వాహకులకు వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక సానా సతీష్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ఇంచార్జి తలాటం హరీష్‌కు అడబాల వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోటు క్లబ్ ఉద్యానవన గ్రంథాలయం వద్ద బాల బాలికలకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నామని అన్నారు. పిల్లల ఆనందం కోసం క్యారం బోర్డ్, చదరంగం తదితర క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచాలనే భావంతో సానా సతీష్ ఫౌండేషన్‌కు వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మేక లక్ష్మణరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి చెల్లించిన ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - అనపర్తి/పెదపూడి : అసెంబ్లీ ఎన్నికల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే 108 కొబ్బరికాయలు కొట్టుకుంటానని టీడీపీ నేత పబ్బినీడు గోవిందు మొక్కుకున్న మొక్కు బడి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు చెల్లించారు. సోమవారం గొల్లల మామిడాడ శ్రీ వర సిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు మొక్కుబడి చెల్లించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జుత్తుక సూర్యకుమారి, శివ రామారెడ్డి, ఎన్‌డిపి నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

కిమ్స్ ఫిజియోథెరపీ విద్యార్థులకు రన్నర్స్ ట్రోఫీ

విశాలాంధ్ర - అమలాపురం : ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు విశాఖపట్టణం విఎఎంపిఎస్ ఫిజియోథెరపీ కాలేజీలో "క్రికెట్ యూనియన్ ఆఫ్ ఫిజియోస్" నిర్వహించిన ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో కిమ్స్ ఫిజియోథెరపీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో ఆడి రన్నర్స్ ట్రోఫీ మరియు నగదు బహుమతి గెలుచుకున్నారని కిమ్స్ ఫిజియోథెరపీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా అశోక్ చక్రవర్తి తెలిపారు. ట్రోఫీ మరియు 12500 రూపాయల నగదు బహుమతిని డా ఎంటిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డా వేమిరెడ్డి రాధికా రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. చదువుతో పాటు ఆటలలో కూడా తమ ప్రతిభను చాటిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ డా అశోక్ చక్రవర్తిని మరియు ఫిజికల్ డైరెక్టర్ నాగ రాజును కిమ్స్ చైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు, ఎండి రవి కిరణ్ వర్మ, కిమ్స్ డీన్ డా ఆనంద్ ఆచార్య అభినందించారు.

ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదికకు రెండు అర్జీలు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం నందు సోమవారం ఎంపీడీవో నాతి బుజ్జి, ఎమ్మార్వో ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వేదిక ద్వారా జిఎన్‌టి రోడ్ నుండి రాజపూడి వయా ఉప్పలపాడు మీదుగా జరుగుచున్న తారు రోడ్డు పిఎంజిఎస్‌వై క్వాలిటీ లోపాలపై ఫిర్యాదు -01, నీటి సరఫరా కొరకు దరఖాస్తు 1 మొత్తం 02 అర్జీలు అందినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన మండలాధికారులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన

విశాలాంధ్ర- పెరవలి :పెరవలి మండల సమైక్య కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై సోమవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ యం.డేవిడ్ నిశ్చల్ హాజరై ఈపథకం గురించి సవివరంగా లబ్ధిదారులకు, ద్వాక్రా యానిమేటర్లకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఏపిఎం బి రామకృష్ణ మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించడానికి గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలియజేయడం జరిగింది. ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బంది, సీసీ లు పీఎం సూర్య ఘర్ గుర్తించిన సభ్యులు హాజరైనారు.

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ

విశాలాంధ్ర - ఆలమూరు : ఆకలంటూ తన ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరికి అన్నం పెట్టిన మహనీయురాలు డొక్కా సీతమ్మని, ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామానికి చెందిన సర్పంచ్ గుణ్ణం రాంబాబు వ్యాఖ్యానించారు. సోమవారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె జన్మస్థలమైన మండపేటలో సీతమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఆయన నివాళులు అర్పించారు. తన సేవా భావంతో అన్నంపెట్టే అమ్మగా చరిత్రలో నిలిచిపోయిన సీతమ్మను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

విశాలాంధ్ర - కొవ్వూరు :మే 10న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూలై 5 వ తేదీకి మార్పినట్లు కొవ్వూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. సోమవారం స్థానిక కొవ్వూరు కోర్టు ఆవరణంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర న్యా య సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జాతీయ లోక్ అదాలత్ జూలై 5వ తేదీ కి మార్చి నట్లు తెలిపారు ఈ విషయన్ని న్యాయవాదులు కక్షి దారులు గమనించి తమ కేసులను జూలై 5వ తేదీ న రాజీ చేసుకుందుకు సంసిద్ధం కావాలని తెలిపారు.

వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు శాఖా గ్రంథాలయం నందు సోమవారం వేసవి శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించారు. జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు కొనసాగుతాయని గ్రంథాలయ అధికారిణి కె పద్మజ తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రతిరోజు పిల్లలకు కథలు చెప్పడం, వారితో చదివించడం, వ్రాయించడం, క్రాఫ్ట్, ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్, డ్రాయింగ్, పాటలు, ఆటలు, నృత్యాలు, స్కిట్స్, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులను విద్యార్థు లంతా సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధరణి ప్రగడ వంశీకృష్ణ, శృంగవరపు వరప్రసాద్, సిహెచ్. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - సామర్లకోట : జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సామర్లకోట శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రత్నమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. సైకాలజిస్ట్ సూర్యప్రకాశ్, ఉపాధ్యాయులు వై కామేశ్వరరావు, రవికుమార్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు మంచి విషయాలపై వేసవి శిక్షణ కొనసాగుతుందన్నారు.

రాజానగరం మండలంకు ఏఎంసీ చైర్మన్ ఇవ్వాలి

విశాలాంధ్ర - రాజానగరం : మార్కెట్ యార్డు కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవిని రాజానగరం మండలం నాయకులను నియమించి సమన్వయం చేసి న్యాయం చేయాలని బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు) పేర్కొన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నియమించనున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకాల సమయం దగ్గర పడడంతో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు) తన అనుచర వర్గంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయం నందు ఈ నెల 27న మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక విశాలాంధ్రతో చరవాణిలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఏఎంసీ పదవి బీసీ వర్గానికి కేటాయించనున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అర్హులైన వ్యక్తులను ఎంపిక చెయ్యాలని కోరారు. ఏఎంసీ పదవులు ఇప్పటికే గత రెండు పర్యాయాలు సీతానగరం, కోరుకొండ మండలాలకు కేటాయించారని, ఈ వరస క్రమంలో ప్రస్తుతం రాజానగరం మండలానికి కేటాయించి సమన్వయ న్యాయం చేయాలని కోరారు. టీడీపీ ఆవిర్భావం నుండి తమ తండ్రి దివంగత వంక సూర్యనారాయణ పార్టీ అభ్యుదయం కోసం అనేక సేవలు అందిస్తే,ఆయన అడుగుజాడల్లో తమ కుటుంబం మొత్తం గత 23 ఏళ్లుగా అనేక సేవలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ పదవిని వంక మాధవి ను నియమిస్తే ఆ పదవికి సైతం వన్నె చేకూరుస్తామని చెప్పారు. తమ కుటుంబ నియమ నిబద్ధతలను, క్రమశిక్షణను గుర్తించి ఏఎంసీ చైర్మన్ పదవిని రాజానగరం మండలానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టీఎన్టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-తాళ్ళపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడి లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ, ముస్లిం సోదరులు మసీదు నుంచి తాళ్లపూడి బస్టాండ్ వరకు నిరసన వ్యక్తం చేస్తూ మౌనంగా ర్యాలీ నిర్వహించారు. హిందు, ముస్లిం భాయిభాయి అని నినదించారు. ఉగ్రవాదదాడిలో అమరులైన నిరపరాధ ప్రజలు, సైనికుల పట్ల తాళ్లపూడి ముస్లిం కమిటీ, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇస్లాం మతం శాంతి, మానవత, సోదరభావాన్ని బోధించదమే కానీ ఉగ్రవాదాన్ని ఎక్కడా ప్రోత్సహించదని రాష్ట్ర నూర్ బాషా బీసీ సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్, మస్జిద్ గౌరవ అధ్యక్షులు రఫీ పేర్కొన్నారు. మస్జిద్ కమిటీ సభ్యులు సర్దార్, షరీఫ్, బాషా, కుదాన్, ఇస్మాయిల్, రజాక్, ఉమర్, సబీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత సుభాష్‌కు సత్కారం

విశాలాంధ్ర - ఆలమూరు : రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత, పినపళ్ల గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్‌కు సోమవారం ఘన సత్కారం జరిగింది. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ రాజు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, తహశీల్దార్ కెజె ప్రకాష్ బాబు, వెటర్నరీ ఏడీ ఎల్ అనిత ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావలసిన పినపళ్లకు ఆ అవకాశం త్రుటిలో తప్పిపోవడం బాధాకరమన్నారు. అయినా సర్పంచ్ సుభాష్ ఏమాత్రం అధైర్య పడకుండా మొక్కవోని దీక్షతో గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపించి అవార్డు సాధించడం మనందరికీ గర్వకారణమని వ్యాఖ్యానించారు. సర్పంచ్ సుభాష్ భవిష్యత్‌లో అనేక ఉన్నత పదవులను చేపట్టి మరెన్నో అవార్డులు సాధించాలని పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు వ్యాఖ్యానించారు. పినపళ్ల గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సర్పంచ్ సుభాష్ రాబోయే రోజుల్లో ఎంఎల్ఏగా గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టాలని మండల స్థాయి ప్రజా ప్రతినిధులు వ్యాఖ్యానించారు.రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు సాధనలో తన వెన్నంటి ఉన్న గ్రామస్తుల సహకారం మరువలేనిదని సర్పంచ్ సుభాష్ వ్యాఖ్యానించారు. అనంతరం అగ్రామ సర్పంచ్ సుభాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్ వీర్రాజును ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ కార్యదర్శులు సంయు క్తంగా శాలువా కప్పి పూలమాలలు వేసి మెమొంటోను బహూకరించి ఘనంగా సత్కరించారు. సూపరింటెండెంట్ ఎంఎం ప్రకాష్, మండల వ్యవసాయాధికారి ఎస్ లక్ష్మీ లావణ్య, మండల విద్యాశాఖాధికారులు బి అప్పాజీ, ఎస్వీ సుబ్బరాజు, ఏపీఎం ఎం ధనరాజు, ఏపీఓ జి అరుణ కుమారి, ట్రాన్స్ కో జెఈ డి దుర్గాప్రసాద్, హౌసింగ్ జేఈ డి శ్రీనివాస్, జేపీ షేక్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : నియోజకవర్గంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణమూర్తి అనంత లక్ష్మి దంపతులు చేతుల మీదుగా అందజేశారు. సోమవారం వలసపాకల తమ నివాసం వద్ద ఆరుగురు లబ్ధిదారులకు రూ.6,97,522ల చెక్కులను పిల్లి దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. నియోజక వర్గంలోని కరప మండలం అర్తకట్ల గ్రామానికి చెందిన కంటే సావిత్రి రూ.4,21,179 లు, గురజనపల్లి గ్రామానికి చెందిన జొన్నగంటి దేవి రూ.52,838లు, నడకుదురు గ్రామానికి చెందిన శెట్టి అప్పల నాయుడు రూ.63,070 సిరిపురం గ్రామానికి చెందిన చింతా సూర్యనారాయణ రూ.50,227లు, రూరల్ మండలం తమ్మవరం గ్రామానికి చెందిన యల్లబోయిన సుబ్బలక్ష్మి రూ.66,608లు, తూరంగి గ్రామానికి చెందిన నిమ్మ జగదీష్ రూ.43,600ల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ముందస్తుగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే పూర్తి వైద్య సేవలు పొందవచ్చని ఎల్ఓసీని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పేదింటి ఆడబిడ్డల మణికర్ణిక సహకారం

విశాలాంధ్ర - జగ్గంపేట : పేదింటి ఆడబిడ్డల చదువుకు మణికర్ణిక యువజన సంఘం సహకారాన్ని అందించింది. విద్యాంజలి అనే కార్యక్రమం ద్వారా పేద ఆడ పిల్లలను చదివించాలనే లక్ష్యంతో పదవ తరగతిలో బాగా చదివిన ముగ్గురు పేద విద్యార్థినులను ఇంటర్ చదివించేందుకు ఎంపిక చేశారు. ఆ సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష సోమ వారం మీడియాతో మాట్లాడుతూ టెన్త్‌లో మంచి మార్కులు సాధించి బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితిలేని కారణంగా చదువు ఆపేయాలని అనుకుంటున్న వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారిలో తండ్రి లేని కిర్లంపూడి మండలం బూరుగుపూడికి గ్రామానికి చెందిన టప సంజన, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట చెందిన సోదగిరి కీర్తన ఉన్నారన్నారు. ఒక కంటి చూపుతో కష్టపడి చదివి 529 మార్కులు సాధించిన జెడ్. రాగంపేటకు చెందిన దోళ్ళ హెబ్సిబాను ఎంపిక చేశామన్నారు. ఈ ముగ్గురు అమ్మాయిలను స్థానిక ప్రైవేటు కళాశాలలో చదివించేందుకు మెడిది సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు మెడిది రావు ముందుకు రావడం జరిగిందన్నారు. వారికి అయ్యే ఫీజు రూ.80 వేల చెక్కును మణికర్ణిక యువజన సంఘానికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెడిది సుబ్బయ్య ట్రస్ట్ సభ్యులు సుజాత, రామ్, అంజనీ కుమారి, రోజా, మణికర్ణిక సభ్యులు మొగలంక శ్రీను, చిక్కాల మణికంఠ, రమణి చిన్ని, వంశీ, వీరబాబు, పీలా మణికంఠ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు

విశాలాంధ్ర - కడియం : పుస్తక పఠనం వ్యక్తులను మహనీయులుగా మారుస్తుందని కడియం గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి పేర్కొన్నారు. కడియం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ మోసిగంటి సత్యవతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలంతా పుస్తక ప్రియులు కావాలని, బాల్యం నుంచి పుస్తకాలు చదవడం వల్ల, నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రయోజకులు అవుతారని అన్నారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి వారు ఎక్కువ పుస్తకాలు చదవడం వల్లే సమాజంలో గొప్ప నేతలగా ఎదిగారని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారిణి శ్రీదేవి నిర్మల మాట్లాడుతూ నలభై రోజులు పాటు జరిగే ఈ శిబిరంలో, పిల్లలకి గ్రంథ పఠనం, ఆటలు, పాటలు, డ్రాయింగ్, నృత్యం, కథలు, చేతి వ్రాత తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రముఖ కవి చిలుకూరి శ్రీనివాసరావు, దాతలు ఉప్పులూరి హనుమంత రావు, అడపా సుబ్రహ్మణ్యం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని గాయత్రి తదితరులు గ్రంథాలయ ఉద్యమ విశేషాలు, పుస్తకాల ఔన్నత్యం గురించి పిల్లలకు వివరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు బొమ్మిరెడ్డి నాగేశ్వరరావు, బొర్రా రామకృష్ణ, చిలుకూరి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాల ఔన్నత్యం గురించి వివరించారు.

ఘనంగా వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ : శాఖా గ్రంథాలయం రామ కృష్ణారావుపేట కాకినాడ లైబ్రరీలో 28న వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా ఆదిత్య కాలేజీలో లెక్చరర్ రత్న మాస్టారు, పి ప్రీతి, అడబాల హరి పాఠకులు, పిల్లలు పాల్గొన్నారు. వేసవి శిక్షణ తరగతులు గురించి రత్నం మాస్టారు మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్, జీకే చెప్తానన్నారు. ఈ వేసవి శిక్షణ తరగతులకు తప్పకుండా అందరూ రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిధులు ప్రీతి, హరి. ఈ కార్యక్రమం గ్రంథాలయ కె రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది.

ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలి : షబానా

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలనీ రాజమహేంద్ర వరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబానా అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డిపో నందు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిపో మేనేజర్ షేక్ షబానా మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆదర్శ ఉద్యోగులుగా ప్రతి ఉద్యోగి ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డ్రైవర్, కండక్టర్, గ్యారేజీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. దీనిలో భాగంగా డిపోలో అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లైనా ఈఎస్ నారాయణ, పి.ఎస్.వాసు, బి.ఎన్.మూర్తి లకు అలాగే అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లైన కె.ఎం.రావు, పిఎస్.చౌదరి. వై.వి.భద్రం,జి.పార్వతి, కెవివిఎస్ఎన్.రాజు, టిఎస్ఎన్. రెడ్డిలతో పాటు గ్యారేజీ సిబ్బందైన ఎన్.యేసమ్మ, పి.కె విడి.ప్రసాద్‌లను సత్కరించి ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగ లక్ష్మి, బస్ స్టేషన్ మేనేజర్ ఏవీ రావు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ,విభాగాలతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

3న జాబ్ మేళా : మంత్రి కందుల

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడం కోసం మే 3న ఎస్ వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో భాగంగా 1302 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా రూ. 12,000 నుండి రూ.40,000 వరకు జీతం పొందవచ్చన్నారు. జాబ్ మేళాకు ఇసుజూ, ఎల్ అండ్ టీ కన్ స్ట్రక్షన్, జీఎంఆర్ కార్గో, పానాసోనిక్, హెచ్ డీబీ ఫినాన్షియల్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ, ఐసోన్ ఎక్స్ పీరియన్సెస్, స్మార్ట్ బ్రెయిన్స్, సాండ్ స్పేస్ టెక్నాలజీస్, డీలేట్ కర్ కార్పొరేట్, సదర్ ల్యాండ్, సినర్జీన్, ఈఎస్ఏఎఫ్, స్పందన, ముత్తూట్ ఫైనాన్స్, పైసా బజార్, రీసొల్యూట్, ఇండస్, ఎంసీవీ, ఇండో ఎంఐఎం, పిల్కింగ్టన్,ఇన్ ఫిలూమ్, హెచ్ డీఎఫ్ సీ, బీఎస్ సీపీఎల్, జీఎల్ఆర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 45 కంపెనీల ప్రతినిధులు రానున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పాసై మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 35 ఏళ్లలోపు ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడెటా, విద్యార్హత, సర్టిఫికెట్లతో మే3న జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కాకినాడ : పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన శాశ్వత పరిష్కారం చూపాలని కాకినాడ జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమమునకు 88 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు.

జ్యోతిష్య విద్యకు దిక్సూచి 'జాతక మాణిక్యం' : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ : ప్రముఖ పంచాంగకర్త, సిద్ధాంతి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రచించిన జాతక మాణిక్యం పుస్తకం జ్యోతిష్య విద్యార్థులకు దిక్సూచి వంటిదని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక చల్లా జగన్నాథ శర్మ కళావేదికలో సరిపెల్ల విరచిత జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భారతమాత చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం మనోవిద్యాన శాస్త్ర పరిశోధకులు డాక్టర్ వింజరపు జనార్ధనం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతక మాణిక్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జ్యోతిష్యశాస్త్రంపై విశేష అధ్యాయనం చేసిన సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రాసిన జాతక మాణిక్యం పుస్తకం కాకినాడకు గర్వకారమన్నారు. ప్రస్తుత సమాజంలో తిధి, నక్షత్రం, జాతకం చూసుకునే పిల్లలకు జన్మనిచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జ్యోతిష్యానికి సంబంధించి పలు అంశాలపై సరిపెల్ల రచించిన ఈ పుస్తకం జ్యోతిష్య విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ప్రముఖ సాహితీవేత్త కాశీ బొట్ల సత్యనారాయణ, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి రామారావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబులు మాట్లాడుతూ జనసామాన్యంలోకి జ్యోతిష్యశాస్త్రాన్ని చేరువ చేయడమే ధ్యేయంగా దశాబ్దాలుగా శ్రీరామచంద్రమూర్తి రచనలు చేస్తున్నట్లు వివరించారు. ప్రముఖ పండితులు పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ తాను రచించిన పరిశోధన గ్రంథం జాతక మాణిక్యం సంస్కృత భాషలో ఋషీశ్వరులు చెప్పిన అనేక యోగ విశేషాలు సోదాహరణంగా తేటతెలుగు ఈ గ్రంథంలో వివరించానన్నారు. ఈ సమావేశంలో పాలపర్తి సుబ్బారావు, చల్లా శ్రీనివాస్ నిరంజన్, సమయమంతుల శ్రీనివాస్ కుమార్, గొట్టుముక్కల వెంకట నరసింహ శాస్త్రి,కుటుంబంలో దీక్షితుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ మామిడిపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పున్నమ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వికాసంకు శిక్షణా తరగతుల దోహదం

విశాలాంధ్ర - కాకినాడ : పాఠశాల విద్యార్థుల్లో సమగ్ర వికాసం పెంపొందించేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయ సంస్థ నిర్వహించే వేసవి శిక్షణా తరగతులు దోహదపడతాయని సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి నాగార్జున అన్నారు. సోమవారం వివేకానంద పార్కులోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక శక్తిని ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఏ కళ పై ఆసక్తి ఉందో ఆ కళను పూర్తిగా నేర్చుకుని అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులను ఉపయోగించుకుని విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు నోరి బలరామకృష్ణ చక్కని గీతాలను ఆలపించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, తల్లితండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దమయపర్రి డ్రైన్ పనులు పూర్తిచేయాలి : మంత్రి

విశాలాంధ్ర - పాలకొల్లు: వచ్చే వర్షాకాలానికి ముందుగానే దమయపర్రి డ్రైన్ పనులు పూర్తిచేయాలనే లక్ష్యం పెట్టుకున్నామని, ఆ దిశగా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో కొత్త మంచినీటి చెరువు ప్రాంతంలో రూ. 14 కోట్లతో జరుగుతున్న దమయపర్రి మురుగు డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత డ్రైనేజీ శాఖ అధికారుల నుంచి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా వర్షాకాలంలో 15 వార్డులకు ఎదురవుతున్న ముంపు సమస్యకు త్వరలో మోక్షం కలగబోతుందన్నారు. దమయపర్రి డ్రైన్ పనులు పూర్తయితే ఇక ముంపు సమస్య శాశ్వతంగా ఉండదన్నారు. ఈ పనులు చేపట్టేందుకు ఊబి ప్రదేశంలో చాలా కష్టమని ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో బ్రతిమలాడి పనులు ముందుకెళ్లేలా ఇరిగేషన్ పెద్ద వర్క్లు చేసే ఏజెన్సీలకు అప్పగించామని మంత్రి రామానాయుడు తెలిపారు. పనులు వేగవంతంగా జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ డ్రైన్ వెంబడి నివాస గృహాలు ఉన్నందువలన రాకపోకలకు రహదారి నిర్మాణమును చేపడుతున్నట్లు మంత్రి రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడి విజయభాస్కర్, ధనాన్ని శ్రీరామమూర్తి, బోనం చినబాబు,కామిశెట్టి జయరాం, దేవ గానుగుల వరలక్ష్మి,జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్,బిరుదుకోట శేఖర్, పొట్నూరి శ్రీనివాస్,బేరం శ్రీరామచంద్రమూర్తి, జిత్తుగా వెంకటేశ్వరరావు,బత్తుల కృష్ణ, షేక్ షీలార్, గంధం సుబ్బారావు, పొట్నూరి రమేష్,బిట్ట లక్ష్మీనారాయణ, విస్సకోట గోపి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: అర్జీదారుల నుంచి అందిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్య తమ శాఖ పరిధిలోనికి రానిపక్షంలో నిర్ణీత గడప వరకు ఉంచకుండా వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పి.జి. ఆర్.ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలో పలు ప్రాంతంలో నుండి వచ్చిన ఫిర్యాదుదారులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్న శాఖలకు ఏప్రిల్ 30న గూగుల్ మీట్ ద్వారా వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి డా.కె.సి.హెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నాగబాబుకు సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : యాతం నాగబాబు (58), వెటరన్ నేషనల్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌లో 3 పతకాలు గెలిసి ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తెచ్చారు. ఏప్రిల్ 21 నుంచి 23 వరకు చాముండి విహార స్పోర్ట్స్ స్టేడియం మైసూరు మహనగరం కర్ణాటక రాష్ట్రం నందు జరిగిన 44 రాష్ట్ర నేషనల్ వెటరన్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ మీట్ పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి రాపర్తి, జల్లూరు గ్రామానకు చెందిన యాతం నాగబాబు 100 మీటర్స్ (3వస్థానం) కాంస్యం , 400 మీటర్స్ (3వస్థానం) కాంస్యం, 800, మీటర్లు (3వ స్థానం) కాంస్యం మూడు విభాగాలలో పాల్గొని మొత్తం 3 కాంస్య పతకాలు సాధించారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగం నందు సబ్ యూనిట్ అధికారిగా పని చేయుచున్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్, నాగబాబును అభినందించారు. నాగబాబు మరిన్ని పతకములు సాధించి ఆరోగ్యంతో జీవించాలని, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకములు సాధించి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకుని రావాలి అని ఎస్పీ అభిలాషించారు.

బాలకృష్ణకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కాకినాడ : నందమూరి బాలకృష్ణకి పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సందర్భంగా, నిన్న ఢిల్లీలో విశాఖపట్నం ఎంపీ మత్తుకుమిల్లి శ్రీభరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ సినీ రంగంలో 50 సంవత్సరాలు పైగా, 110కు మించి చిత్రాలలో నటిస్తూ తన అసాధారణ నటనా ప్రతిభ, ఆకట్టుకునే వ్యక్తిత్వంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న మా బాలకృష్ణ సినిమా రంగానికి మాత్రమే కాకుండా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా పేదలకు, అవసరమైన వారికి అందించిన సేవలు అపూర్వమైనవి అని కొనియాడారు.